క్లుప్తంగా

మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలి



ముమ్మిడివరంలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు, పోలీసులు

ముమ్మిడివరం: మధ్యవర్తిత్వం ద్వారా త్వరిత గతిని కేసులు పరిష్కరించుకొని మానవ సంబంధాలు మెరుగుపర్చుకోవాలని మండల లీగల్ సెల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా పిలుపు నిచ్చారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మంగళవారం ముమ్మిడివరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోర్టు ప్రాంగణం నుంచి ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని అవగాహన కల్పించారు. ఈర్యాలీలో న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రికి వైద్య సామగ్రి అందజేత



ఆస్పత్రి సూపరింటెండెంట్ శంకరరావుకు వైద్య సామగ్రిని అందజేస్తున్న దాతలు

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన విశ్రాంత ఎంఈవో దివంగత పరమట సహదేవుడు జయంతి సందర్భంగా ఆయన సతీమణి, కుమార్తెలు రూ.1.50 లక్షల విలువైన వైద్య సామగ్రిని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి సమకూర్చారు. ఆస్పత్రి వద్ద మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరావుకు దివంగత ఎంఈవో కుటుంబీకులు వితరణగా సమకూర్చిన వైద్య సామగ్రిని అందజేశారు. దివంగత ఎంఈవో సహదేవుడు సతీమణి పరమట సత్యవతి, ఆయన కుమార్తెలు విజయశ్రీ, భారతి, శైలజ, నిర్మల, దీప్తి కుటుంబ సభ్యులు పలు వైద్య పరికరాలను సమకూర్చారు. ఐసీయూ కాట్, హార్ట్ రేట్ మోనిటర్, ఆక్సిజన్ సిలిండర్, ఎయిర్ బెడ్ తదితర వైద్య సామగ్రిని అందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ఆవుపాటి వేణుగోపాల్, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈదరపల్లి వంతెన వద్ద జంక్షన్ల అభివృద్ధికి ప్రణాళిక

అమలాపురం రూరల్: ఈదరపల్లి వంతెన ఎగువ దిగువన ఉన్న జంక్షన్ల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మున్సిపల్, ఆర్అండ్‌బీ రెవెన్యూ, ఏపీ ఈడీసీఎల్ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించి ఇటీవల ఆధునీకరించిన ఈదరపల్లి వంతెన ఎగువ దిగువ జంక్షన్లను అముడా, మున్సిపల్ శాఖల సమన్వయంతో సుందరీకరించనున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ఎగువ, దిగువ జంక్షన్లో అభివృద్ధికి అధికారుల సమన్వయంతో పాటుపడాలని సూచించారు. మ్యాప్ ఆధారంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సుందరీకరణ పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి ఆర్డీఓ కె.మాధవి, ఏపీఈడీసీఎల్ ఎస్ఈ రాజకుమారి ఆర్అండ్‌బీ ఎస్సీ రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆధునికతను అందిపుచ్చుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ అఖిల్, ఆర్ఏఓ

యానాం: విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా విద్యా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఈ పోటీ ప్రపంచానికి కావాల్సిన ఆధునిక విద్యను అందిపుచ్చుకుని నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలని ట్రైనీ ఐఏఎస్, మున్సిపల్ కమిషనర్ అఖిల్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో స్వాతంత్ర్య సమరయోధుడు, సమాజ సేవకుడు కామరాజర్ నాడర్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన స్టూడెంట్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1957లో కామరాజ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తమిళనాడులో అమలు చేసిన ఉచిత విద్య, ఉచిత మధ్యాహ్న భోజనం తదితర పథకాల ద్వారా గ్రామీణ పేద ప్రజలు విద్యావకాశాలను అందుకున్నారని ఆయన సేవలకు గుర్తింపుగా భారతరత్న ప్రదానం చేసారని పలువురు పేర్కొన్నారు. అంతముందు కామరాజ్ నాడర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆఏఓ మునిస్వామి, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఆక్వాకు వ్యాధుల గండం

- విజృంభిస్తున్న బ్యాక్టీరియా, వైరస్ వ్యాధులు
- విభిన్న వాతావరణ పరిస్థితులతో ఇబ్బందులు
- కరెంట్ కోతల కారణంగా పెరుగుతున్న పెట్టుబడి



ఎన్ కొత్తపల్లిలో చెరువులో ఆక్సిజన్ కోసం ఏరియేటర్ల వినియోగం

కాట్రేనికోన: వర్షాకాలం ప్రారంభంలో చాలా రోజులు ఆకాశం మేఘావృతమై ఉష్ణోగ్రతలు తగ్గడంతోపాటు తేలిక పాటి వర్షాలు కురవడంతో ఆక్వా సాగుకు ఆటంకం ఏర్పడింది. జూలైలో పగటిపూట అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ సాయంత్ర మేఘావృతమవుతూ విభిన్న వాతావరణ పరిస్థితులు ఏర్పడటంతో ఆక్వా చెరువుల్లోని పారామీటర్‌లో పెను మార్పులు రావడంతో బ్యాక్టీరియా, వైరస్‌లు వృద్ధి చెంది వ్యాధులు విజృంభిస్తున్నాయి. అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు, మామిడికుదురు, రాజోలు, మల్కిపురం మండలాల్లో సుమారు 30 వేల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు.

మిశ్రమ పద్ధతిలో సాగు

టైగర్ రొయ్యలు తరచూ వ్యాధుల బారిన పడటంతో వనామీ రొయ్యలను సాగు చేస్తున్నారు. ఆక్వా సాగులో వనామీ రొయ్యల సాగు, మిశ్రమ పద్ధతిలో చేపల సాగు (పాలీకల్చర్) చేస్తున్నారు. పల్లం, చిర్రయానం, గచ్చకాయలపోర, ఎస్ కొత్తపల్లి, రాఘవులుపేట, సామంతకుర్రు, ఎస్ యానం, పర్రభూముల్లోని ఉప్పు నీటి చెరువుల్లో, 5–10 పీపీటీ ఉప్పు శాతం ఉన్న ప్రాంతాల్లో సీబాస్(పండు గొప్ప) చేపలు పెంచుతున్నారు. ఇటీవల వాతావరణ మార్పులతో చెరువులలోని చేపలు, రొయ్యలు బ్యాక్టీరియా, వైరస్ వ్యాధుల బారినపడి మృత్యువాత పడటంతో పట్టుబడులు చేస్తున్నారు. వ్యాధులతో పాటు కరెంటు కోతలతో ఆక్సిజన్ స్థాయి తగ్గిపోవడంతో రొయ్యలు, చేపలు మృత్యువాత పడుతున్నాయి.

ఆక్సిజన్ లోపించి మృత్యువాత పడుతున్నాయి

వాతావరణంలోని మార్పులు అధిక ఉష్ణోగ్రతలు, వర్షాలకు చెరువులో ప్లవకాలు (ప్లాంక్టాన్) చనిపోవడంతో చెరువు నీటి, మట్టి నాణ్యత దెబ్బతినడం, చేపలు, రొయ్యలు తినగా మిగిలిన మేత చెరువు అడుగు భాగానికి చేరి కుళ్లిపోవడంతో అమ్మోనియం, నైట్రేట్ వంటి విష వాయువులు విడుదలవుతున్నాయి. చెరువు నీటి నాణ్యతను పెంచేందుకు, విషవాయువుల స్థాయి తగ్గించేందుకు జియోలైట్ వంటి మందులను ప్లాంటేషన్ ఉత్పత్తి కోసం రైతులు అధిక ఖర్చు చేయవలసి వస్తోంది.

కరెంట్ కోతలతో రైతులకు కష్టాలు

రొయ్యల సాగులో ఆక్సిజన్ స్థాయిని పెంచేందుకు చెరువుల్లో రైతులు ఏరియేటర్లతో ఆక్సిజన్‌ను అందిస్తారు. అధిక ఉష్ణోగ్రతలకు తోడు అడ్డూఅదుపు లేకుండా విద్యుత్ శాఖ అనధికారిక కరెంట్ కోతలతో ఆక్వా సాగుకు అటంకం ఏర్పడుతోందని రైతులు అంటున్నారు. కరెంట్ సక్రమంగా లేక డీజిల్ ఆయిల్‌తో ఏరియేటర్లు తిప్పలేక పోతున్నామన్నారు. చెరువులోని ఆక్సిజన్ స్థాయి తగ్గిపోవడంతో చేపలు, రొయ్యలు మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులోని రొయ్యలు రన్నింగ్ మోర్టాలిటీతో ఏరియేటర్ల దగ్గరకు చేరి అధిక మొత్తంలో చనిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

విజృంభిస్తున్న బ్యాక్టీరియా, వైరస్ వ్యాధులు

చెరువులో ఆక్సిజన్ సక్రమంగా అందక చేపలు, రొయ్యలు బలహీనంగా ఉండటంతో బ్యాక్టీరియా, వైరస్ వ్యాధులు దాడి చేస్తున్నాయి. రొయ్యల్లో వైట్ స్పాట్, విబ్రియో, వైట్ ఫీకల్, వైట్ గట్ వంటి వ్యాధులు, చేపల చెరువులో బాక్టీరియల్, బాహ్య పరాన్న జీవులతో వచ్చే ఎర్రటి మచ్చల వ్యాధి, ఆల్గురస్ (పేను), శంకు జలగ తదితర వ్యాధులు దాడి చేస్తున్నాయి. వ్యాధుల నివారణకు మందుల కోసం అధికంగా ఖర్చు చేయవలసి వస్తోందని రైతులు వాపోతున్నారు.

> **వ్యాధులు ప్రబలడంతో రొయ్యల పట్టుబడి**
>
> కరెంట్ కోతలు అధికంగా ఉండటంతో చెరువులోని ఆక్సిజన్ స్థాయి పడిపోయి పైకి చేరి ఈదుతున్నాయి. చెరువులోని రొయ్యలు రన్నింగ్ మోర్టాలిటీతో ఏరియేటర్ల దగ్గర పడి చనిపోతున్నాయి. రొయ్యలు బలహీనంగా ఉండటంతో వైట్ స్పాట్ వైరస్ సోకడంతో పట్టుబడి చేస్తున్నాం.
>
> – పి.రామకృష్ణంరాజు, ఆక్వా రైతు, కాట్రేనికోన

వైఎస్ జగన్‌తో భేటీ



జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌ను తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో అమలాపురం నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌తో కలసి ఇజ్రాయిల్ జగన్‌తో కొద్దిసేపు భేటీ అయ్యారు. తప్పుడు కేసులతో కూటమి ప్రభుత్వం ఎన్ని వేధింపులకు పాల్పడినా వాటిని తట్టుకుని నిలబడుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు తాను అండగా ఉంటానని జగన్ స్పష్టం చేశారని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తెలిపారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

అల్లవరం: వైఎస్సార్ సీపీ నాయకుడు దివంగత చింతా కృష్ణమూర్తి జయంతి పురస్కరించుకుని చింతా కృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన కుమార్తె, ఫౌండర్ మాజీ ఎంపీ చింతా అనురాధ సౌజన్యంలో వృద్ధులకు, రోగులకు దుప్పట్లు, చీరలు, ఆహార ప్యాకెట్లను సంస్థ సభ్యులు మంగళవారం పంపిణీ చేశారు. అల్లవరంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలోని రోగులు, అమలాపురం రూరల్ పరిధిలో హరిమనో వికాస కేంద్రంలోని దివ్యాంగులు, నిరాశ్రయులకు అందించారు.

పీఎం సూర్య ఘర్ యోజనతో విద్యుత్ ఆదా



సూర్య ఘర్ పథకం ప్రయోజనాలను వివరిస్తున్న మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్

అమలాపురం టౌన్: ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా కేంద్ర ప్రభుత్వం సమకూర్చే సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని సోలార్ రూఫ్ టాప్‌లతో విద్యుత్ ఆదా ప్రయోజనాన్ని పొందాలని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాయలంలో వార్డుల సచివాలయాల కార్యదర్శులతో సూర్య ఘర్ యోజనపై మంగళవారం ఉదయం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ నిర్మల్‌కుమార్ మాట్లాడారు. ఈ పథకాన్ని ఉపయోగించుకునే వారికి ప్రభుత్వం రూ.78 వేల వరకూ సబ్సిడీ ఇస్తుందని, అదే ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్‌లను ఏర్పాటు చేస్తుందని కమిషనర్ వివరించారు. మున్సిపాలిటీలోని గృహ యాజమానులకు ఈ పథకంతో కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. సబ్సిడీతో సమకూరే ఆదా, విద్యుత్ ఆదా, సోలార్ ద్వారా మనం ఉత్పత్తి చేసుకున్న మిగులు విద్యుత్‌ను ప్రభుత్వమే మన వద్ద నుంచి కొనుగోలు చేస్తుందన్న విషయాన్ని వివరించి అవగాహన కల్పించాలని కమిషనర్ వార్డు సచివాలయాల కార్యదర్శులకు సూచించారు. రెండు రోజుల్లో పట్టణంలో ఇంటింటికీ వెళ్లి సోలార్ విద్యుత్‌పై ఆసక్తి ఉన్న వారి వివరాలను సేకరించి సమగ్ర నివేదిక ఇవ్వాలని కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు. ఏపీఈపీడీసీఎల్ డీఈఈ జి.అన్నవరంతో పాటు సోలార్ రూఫ్ టాప్స్ ఏర్పాటుచేసే ఏజెన్సీల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు

కమిషనర్ పారిశుధ్య పనుల పరిశీలనకు పట్టణంలో మంగళవారం ఉయయం పలు ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్యం విషయంలో రాజీ పడేది లేదని, ఎవరైనా పారిశుధ్య విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని ముఖ్యంగా శానిటరీ మేస్త్రీలను కమిషనర్ హెచ్చరించారు. మున్సిపల్ డీఈఈ కె.సత్యనారాయణ, ఏఈలు కమిషనర్ వెంట ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



వాకర్స్ ఆరోగ్య అవగాహన సదస్సులో మాట్లాడుతున్న చర్మవ్యాధుల నిపుణురాలు డాక్టర్ మంజరి అన్నపూర్ణ

అమలాపురం టౌన్: ప్రతి ఒక్కరూ చర్మ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, అందరూ ఇది అత్యవసర బాధ్యతగా భావించాలని పట్టణానికి చెందిన చర్మ వ్యాధుల నిపుణురాలు డాక్టర్ మంజరి అన్నపూర్ణ అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత లోపించినా, శరీత తత్వాన్ని బట్టి చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల వద్ద మంగళవారం ఉదయం చర్మ వ్యాధులపై నిర్వహించిన అవగాహన సదస్సులో డాక్టర్ మంజిరి అన్నపూర్ణ మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల చర్మ వ్యాధులు సోకవని డాక్టర్ సూచించారు. డాక్టర్ మంజరి అన్నపూర్ణను, సదస్సుకు మలికిపురం నుంచి సైకిల్ తొక్కుకుని వచ్చిన బోణం రాజును వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించి అభినందించారు. క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ ఆరోగ్య సదస్సులో వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, వాకర్స్ ప్రతినిధులు డాక్టర్ సీహెచ్ విష్ణుమూర్తి, తేతల సత్యనారాయణరెడ్డి, నూకల సత్యనారాయణ, కుడుపూడి త్రినాథ్, పడాల నాయుడు పాల్గొన్నారు.

స్కూల్ వాహన డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



ఆటో, కాలేజీ బస్సుల డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పట్టణ సీఐ వీరబాబు, ట్రాఫిక్ ఎస్సై ఏసుబాబు

అమలాపురం టౌన్: ప్రైవేటు విద్యాలయాలకు రోజూ విద్యార్థులను తరలించే ఆటోల్లో పరిమితికి మించి ఎక్కించుకునే ఆటో డ్రైవర్లపై కఠిన చర్యలు ఉంటాయని పట్టణ సీఐ పి.వీరబాబు హెచ్చరించారు. స్థానిక సావరంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాల వద్ద ఉన్న ఆటోలు, కాలేజీ బస్సులకు చెందిన డ్రైవర్లకు సీఐ వీరబాబు, పట్టణ ట్రాఫిక్ ఎస్సై ఎం.ఏసుబాబు మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆటోల్లో పిల్లలను పరిమితికి మించి ఎక్కించుకుంటే కళాశాల యాజమాన్యాలు అభ్యంతరం చెప్పాలని, దీనిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆటోల వేగ నియంత్రణ పాటించాలని పేర్కొన్నారు. కాలేజీ బస్సుల డ్రైవర్లు వేగ నియంత్రణ పాటించాలని, అనుక్షణం అప్రమత్తతో డ్రైవింగ్ చేయాలని సీఐ సూచించారు. ట్రాఫిక్ ఎస్సై ఏసుబాబు మాట్లాడుతూ పరిమితికి మంది ఆటోల్లో విద్యార్థులను ఎక్కించుకున్నా, కాలేజీ బస్సుల డ్రైవర్లు బస్సులను నిర్లక్ష్యంగా నడిపినా నమోదయ్యే కేసులు, శిక్షలు, జరిమానాలను వివరించారు.

రాజోలు హెడ్ పోస్టాఫీస్ భవనం సిద్ధం

అమలాపురం టౌన్: అమలాపురం పోస్టల్ డివిజన్ పరిధిలోని రాజోలులో నూతనంగా నిర్మించిన హెడ్ పోస్టాఫీస్ భవనాన్ని కేంద్ర కమ్యూనికేషన్స్, గ్రామీణాభివద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తారని పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్ అమలాపురంలో మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథూర్, రాజోలు ఎమ్మెల్యే డి.వరప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. రాజోలు అగ్నిమాపక కేంద్రం సమీపంలోని ఏడు సెంట్ల స్థలంలో ఈ పోస్ట్ ఆఫీస్ భవనాన్ని రూ.1.30 కోట్లతో నిర్మించారు. గత ప్రభుత్వంలో అప్పటి అమలాపురం ఎంపీ చింతా అనురాధ రాజోలు పోస్ట్ ఆఫీస్ నూతన భవన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు కేటాయించారు. అద్దె భవనంలో ఉన్న హెడ్ పోస్టు ఆఫీస్‌కు మాజీ ఎంపీ అనురాధ చొరవతో సొంత భవనం సమకూరింది.

శివారు ప్రాంతాలకు అందని సాగునీరు

ఉప్పలగుప్తం: కాలువలకు నీరు విడుదల చేసి 26 రోజులు గడుస్తున్నా శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదని మండలంలోని ఎన్.కొత్తపల్లి గ్రామ పంచాయతీకి చెందిన రాఘవులపేటకు చెందిన రైతులు మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్.కొత్తపల్లిలో కొంతమేర మాత్రమే సాగునీరు ప్రవహిస్తోందని దిగువ ప్రాంతానికి రావడం లేదని రైతులు అన్నారు. రాఘవులపేటలోని కాలువల్లో ప్రవాహం లేక నీరు నిల్వ ఉండి మురుగుగా మారిందని, పశువులు కూడా తాగడం లేదని, నిత్యవసరాలకు ఉపయోగించుకునే వీలు లేకుండా పోయిందని వాపోయారు. నాలుగు వారాలైనా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని వారన్నారు. అధికారులు స్పందించి సాగునీటి ప్రవాహాన్ని పెంచాలని కడియం సందీప్, రుద్రరాజు శ్రీనిరాజు, ఓలేటి దుర్గప్రసాదు, నాని బాబు, చిలకలపూడి శ్రీను, సానబోయిన శివాజీ తదితరులు కోరారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ





తిల్లకుప్పలో ఆషాఢ సారెను తీసుకువెళ్తున్న భక్తులు. అనాతవరంలో అమ్మవార్లకు భక్తులు సమర్పించిన సారె

ఐ పోలవరం: తిల్లకుప్ప గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ మహిళా విభాగం ప్రతినిధుల పర్యవేక్షణలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవత తిల్లాలమ్మకు ఆషాఢ మాసం సారె సమర్పించారు. ముందుగా మహిళలు గోదావరి నది జలాలను తీసుకుని శోభాయాత్రగా బయలుదేరి అమ్మవారికి అభిషేకం చేశారు. మేండా వారి పల్లవారి కుటుంబ సభ్యులు అమ్మవారికి సారె కావిళ్లు, పండ్లు, పువ్వులు సమర్పించారు. ఆడపడుచులు, మాతృమూర్తులు, గ్రామస్తులు తెచ్చిన సారెను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడియం తమ్మయ్య మాట్లాడుతూ భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సారే సమర్పించడం ఆనందదాయకంగా ఉందన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ అరవ శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ ధర్మ ప్రచారక్ కనకారావు, తోటకూర బాబులురాజు, యాళ్ల జై జైలు మెండా సత్యనారాయణ, పళ్ల రాంబాబు, శీలం నాగరాజు, కడియం సత్యవతి, పెన్నాడ సుబ్బలక్ష్మి, కడియం వెంకటలక్ష్మి, శీలం సునీత, భక్తులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ, మరిడమ్మకు సారె

ముమ్మిడివరం: అనాతవరంలో ఎస్ఎస్ఎఫ్ మండల మహిళా కన్వీనర్ నల్లా అండాల్ దేవి పర్యవేక్షణలో మహిళలు,ఆలయ కమిటీ సభ్యులు గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, మరిడమ్మకు ఆషాఢం సారె సమర్పించారు.ముందుగా అమ్మవారికి పసుపు నీళ్లతో అభిషేకం, చేసి ఆడపడుచులు తీసుకువచ్చిన సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో సమరత సేవా ఫౌండేషన్ దార్మిక సమితి సభ్యులు తూనికుంట్ల ప్రతిమ, వేటూరి పుష్ప, యాళ్ల రత్నకుమారి, కేతా రాము, కుడిపూడి మహాలక్ష్మి, కొప్పిశెట్టి నగ కీర్తి పాల్గొన్నారు.

ఎస్సీల సంక్షేమానికి జీవో 5తో విఘాతం



జీఓ 5కు వ్యతిరేకంగా దళితుల ధర్నా

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం ఇటీవలి జారీ చేసిన జీఓ 5 రీజియన్ పరిధిలో ఎస్సీల సంక్షేమానికి విఘాతంగా మారిందని, తక్షణం ఆ జీఓలో మార్పులు తీసుకురావాలని కోరుతూ మంగళవారం నియోజకవర్గ పరిధిలో వందలాది మంది దళితులు స్థానిక ఆర్ఏఓ కార్యాలయం వద్ద ఎస్సీ, ఎస్టీ యునైటెడ్ ఫోరమ్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరమ్ కన్వీనర్ పొనుగుమట్ల విష్ణుమూర్తి మాట్లాడుతూ ఎస్సీ సంక్షేమ పథకాలకు విఘాతం కలిగించే విధంగా జీఓ 5 ప్రభుత్వం జారీ చేసిందని విమర్శించారు. ప్రస్తుతం ఎస్సీలకు గృహ నిర్మాణానికి అందించే సహాయాన్ని రూ.పది లక్షలకు పెంచాలని, ఆదాయ పరిమితిని తొలగించి దళితులందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, దీర్ఘకాలిక రోగులకు నెలకు రూ.పది వేలు ఇవ్వాలని, ఎస్సీల అంత్యక్రియలకు అందించే మట్టి ఖర్చుల సహాయాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. అంతకుముందు పాతబస్టాండ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తమ డిమాండ్లపై ఆర్ఏఓ మునిస్వామికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్ఏఓలు గిడ్డి బలరాం, నామాడి అప్పారావు, న్యాయవాది కమిడి విజయ కుమార్, శివగణేష్, మాజీ మున్సిపల్ చైర్మెన్ పెండెం సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

పథకాలు నిలిపివేయడం తగదు

యానాం: ఎస్సీ సంక్షేమ పథకాల అమలుకు విఘాతంగా మారిన జీఓ 5పై నూతనంగా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జాన్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లినట్లు మంగళవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఆ జీఓకు సంబంధించి జారీచేసిన గెజిట్‌కు వ్యతిరేకంగా ఎల్జీ కైలాసనాథన్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. సంక్షేమ పథకాల అమలుకు దళితులకు ఉండే ఇంటి స్థలానికి ముడిపెట్టడం అన్యాయమన్నారు. గతంలో ఎల్‌జీఆర్ పట్టాలు దళితులకు మంజూరు చేశారని ఆ స్థలాల విస్తీర్ణాన్ని బూచిగా చూపి సంక్షేమ పథకాలను నిలిపివేసేందుకు జారీచేసిన జీఓను ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని, లేకుంటే దళితులతో కలిసి నిరసనకు దిగుతానని ఆయన హెచ్చరించారు.

ఘనంగా సుబ్బాలమ్మ జాతర



సుబ్బాలమ్మ జాతరను నిర్వహిస్తున్న ఆటో యూనియన్ కార్మికులు

అమలాపురం టౌన్: పట్టణ దేవత సుబ్బాలమ్మ ఆషాఢ మాస జాతర స్థానిక శ్రీరామపురం ఆటో యూనియన్‌కు చెందిన కార్మికులు (డ్రైవర్లు) మంగళవారం వైభవంగా నిర్వహించారు. శ్రీరామపురం నుంచి సుబ్బాలమ్మ దేవస్థానం వరకూ గరగ నృత్యాలు, బాణసంచా కాల్పులతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు పర్యవేక్షించారు. ఈ జాతరలో శ్రీరామపురం పెద్దలు వాసంశెట్టి చిన బాబు, దంగేటి కొండబాబు, కుడుపూడి శ్రీను, శ్రీరామపురం ఆటో యూనియన్ నాయకులు దొమ్మేటి రామకృష్ణ, కొండేటి ప్రసాద్, మన్యం మాచరయ్య, ఉర్రింక చిట్టిబాబు, కుంచే నాని, కామన నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన సొసైటీ అధ్యక్షులు

అమలాపురం రూరల్: భట్నవిల్లి సొసైటీ అధ్యక్షుడిగా నామాడి వెంకట్రావు డైరెక్టర్లగా కొలిశెట్టి జయ ప్రకాశ్ నారాయణ్ మండలిక సుబ్రహ్మణ్యశర్మ ప్రమాణ స్వీకారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ నాయకులు మెట్ల రమణబాబు అముడా చైర్మన్ అల్లాడి సాంబాబు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ అధికారి జయలక్ష్మి, రెడ్డిపల్లి నుంచి గ్రామ ప్రజలు, నాయకులు వెంకట్రావును అభినందించారు. రోళ్లపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా మట్ట మహాలక్ష్మి ప్రభాకర్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రంగాపురం పీఏసీఎస్ చైర్మన్ సత్తి రామచంద్రరావు ప్రమాణస్వీకారం చేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ యాళ్ల సతీష్, రూరల్ మండల అధ్యక్షుడు లింగోలు పండు, పరమట చిట్టిబాబు, మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీను, కల్వకొలను తాతాజీ సత్కరించారు.

అల్లవరం సొసైటీ చైర్మన్‌గా గోపి ప్రమాణ స్వీకారం

అల్లవరం: సొసైటీ చైర్మన్‌గా కంకిపాటి గోపి మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. అల్లవరం సెంటర్ నుంచి భారీగా ఊరేగింపుగా సొసైటీ కార్యాలయానికి చేరుకుని ఆయన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చైర్మన్ గోపిని అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మెట్ల రమణబాబు, గుబ్బల చినబాబు, పెచ్చెట్టి చంద్రమౌళి పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

అమలాపురం రూరల్: వన్నెచింతలపూడిలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని కిమ్స్ చైర్మన్ కలిదిండి సత్యనారాయణ రాజు (చైతన్య రాజు) ప్రారంభించారు. ఈ శిబిరంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్తిబాబు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, లైయన్స్ క్లబ్ ప్రతినిధి పట్నాల రమణ, చైతన్య తదితరులు చైతన్య రాజును సత్కరించారు.

కొనసాగుతున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె



సమ్మెలో పాల్గొన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

ముమ్మిడివరం: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నగర పంచాయతీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె మంగళవారం మూడవ రోజుకు చేరుకుంది. గత సమ్మెకాలపు ఒప్పందాల ప్రకారం జీఓ– 36 అనుసరించి జీతాలు పెంచాలని, ప్రభుత్వంలో ఇప్పటివరకు రెండు దఫాలు చర్చలు జరిగినప్పటికీ న్యాయం జరగలేదని, ప్రభుత్వం స్పందించక పోవడంతో సమ్మెకు దిగామన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుకు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. సఖిలే సూర్యనారాయణ, విళ్ల వీరా స్వామినాయుడు, ఎం.శ్రీనివాసరావు, ఎస్.అజయ్ కుమార్, వి.వెంకటేశ్వరులు, జి.రమేష్, వై.రమణ, జి.వెంకటేశ్వరరావు, కే.శ్రీనివాసరావు, వి.ప్రసాద్ కే.శివ పాల్గొన్నారు

డ్రెయిన్ ఆధునీకరణకు శంకుస్థాపన

ఉప్పలగుప్తం: గొరగనమూడి మీడియం డ్రెయిన్‌ను ఆధునీకరణ పనులకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ముంపు నీటితో పంటకు నష్టం వాటిల్లకుండా రూ.65 లక్షల నిధులతో 10.3 కిలోమీటర్ల పొడువున డ్రెయిన్‌లోని పూడికను తొలగించి ఆధునీకరిస్తామని ఆయన తెలిపారు. ఈ డ్రెయిన్ ఆధునీకరణతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఇరిగేషన్ ఎస్ఈ కె.గోపినాథ్, ఈఈ ఎంవీవీ కిషోర్, ఏఈ సునీత, చిక్కం పెద్దబ్బులు, పెయ్యల దుర్గారావు, నాగులపల్లి పాపయ్య రాజు, చిక్కం భీముడు, అకుల బుజ్జి, బండారు వెంకన్న పాల్గొన్నారు.

ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం

మామిడికుదురు: ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవాన్ని మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు పలు పోటీలు ఏర్పాటు చేశారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు డ్రాయింగ్, రోల్ ప్లే, క్విజ్, చార్ట్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. రిటైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో కూడా పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. హెచ్ఎం బి.చిరంజీవి రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్స్ వై.మధు, జె.మోనికా కృష్ణ, పి.సత్యశ్రీ, స్టాఫ్ సెక్రటరీ భూపతి మనోహర రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.